ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

గురువారం 5 సెప్టెంబరు 2024

'కొక్కిరాపల్లి' నువ్వు వంగడానికి త్వరలో జాతీయస్థాయి గుర్తింపు

- ఇప్పటి వరకు ఇక్కడి నుంచి ఐదు రకాల వంగడాలు రాష్ట్రస్థాయిలో విడుదల
- నూతన రకం వైఎల్ఎం-146 ద్వారా అరుదైన కీర్తి
- వివరాలు వెల్లడించిన ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు

·7లో

అధికారులు అప్రమత్తం

- జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం
- అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశం
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచన
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- అందుబాటులో 8924-222888, 8924-226599 ఫోన్ నంబర్లు

అల్పపీడనంపై ప్రభుత్వం ముందస్తు హెచ్చరిక



కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తాజాగా వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు అందుబాటులో ఉండాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు.

ఇటీవల జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి కాస్త తెరిపిచ్చింది. ఇంతలో మరో అల్పపీడనం రానున్నదని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వరదల వల్ల విజయవాడలో జనజీవనానికి ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రానున్న 24 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో అధిక వర్షాలు కురిసే అవకాశాలున్నందున అన్ని జిల్లాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి అధ్వానంగా మారిన సంగతి తెలిసిందే.

అధికారులు సంసిద్ధంగా ఉండాలి

జిల్లాలో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం మండల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లాలో జనజీవనానికి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా అందుబాటులో ఉండి తక్షణమే స్పందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు మండల కేంద్రాల్లోనే ఉండాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, ఇప్పటికే వేటకు సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకొనేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు మునిసిపల్, పంచాయతీ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కాగా రాగల 24 గంటల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. 08924-222888, 08924-226599 ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు. మండలాల నుంచి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు అందేలా 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

వంతెన నిర్మాణం కలేనా?

పెదకలవలాపల్లి- రజాల గ్రామాల మధ్య నిర్మించాలని గతంలో ప్రతిపాదన

- కార్యరూపం దాల్చక 15 గ్రామాల ప్రజల ఇక్కట్లు
- కూటమి ప్రభుత్వ హయాంలోనైనా సాకారమవుతుందని ఆశాభావం




గత ఏడాది నీటి ప్రవాహానికి రహదారి కొట్టుకుపోవడంతో అవస్థలు పడుతూ నది దాటుతున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

రాంబిల్లి, సెప్టెంబరు 4:

మండలంలోని పెదకలవలాపల్లి- రజాల మధ్య మేజర్ శారదా నదిపై వంతెన లేకపోవడంతో 15 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత పాలకులు ఇక్కడ వంతెన నిర్మిస్తామని ప్రకటించినప్పటికీ అది కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

మండలంలోని పెదకలవలాపల్లి-రజాల మధ్య మేజర్ శారదా నదిపై వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన ఎన్నో ఏళ్లుగా ఉంది. ఇక్కడ వంతెన నిర్మిస్తే దిమిలి పరిసర ప్రాంతాల ప్రజలు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రం రాంబిల్లికి సులువుగా చేరుకోవచ్చు. అయితే వంతెన లేకపోవడంతో సుమారు 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించి రాంబిల్లికి చేరుకోవలసి వస్తోంది. పెదకలవలాపల్లి, వైలోవ గ్రామాలకు చెందిన పంట భూములు నదికి అవతల వైపు ఉన్నాయి. నదిలో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఆయా గ్రామాల ప్రజలు నదిని పుట్టు సాయంతో దాటాల్సి వస్తుంది. ధాన్యం, అపరాలను గ్రామాలకు తరలించాలంటే ఆ రెండు గ్రామాల రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నదిపై రాకపోకలు సాగించేందుకు, పండిన పంటలను ఇళ్లకు తెచ్చుకొనేందుకు ఆయా గ్రామాల ప్రజలు విరాళాలతో వేసవి కాలాల్లో తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేసుకొనేవారు. వర్షాకాలంలో, తుఫాన్ల సమయంలో నదిలో నీటి ఉధృతికి తాత్కాలిక రహదారి కొట్టుకుపోయేది. మళ్లీ వేసవిలో ఆయా గ్రామాల ప్రజలు తాత్కాలిక రహదారిని నిర్మించుకొనేవారు. మళ్లీ నది ఉధృతంగా ప్రవహిస్తే రహదారి కొట్టుకుపోయేది. ఈ సమస్య ఏళ్ల తరబడి ఈ గ్రామాల ప్రజలను వేధిస్తోంది.



పెదకలవలాపల్లి- రజాల గ్రామాల మధ్య నదిపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం ఇదే

ప్రతిపాదనలకే పరిమితం

యలమంచిలిలో 2011 నవంబరు 2న జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న అప్పటి ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్‌రెడ్డికి అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు వంతెన లేకపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో పెదకలవలాపల్లి, రజాల మధ్య శారదానదిపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని కిరణ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. నదిపై వంతెన నిర్మాణానికి సంబంధించి సర్వేలు నిర్వహించి రూ.9.9 కోట్లు ప్రతిపాదనలు తయారుచేసి సంబంధిత అధికారులు పంపించారు. కానీ నిధులు మంజూరు కాలేదు. ఆ తరువాత ప్రభుత్వాలు మారినా వంతెన నిర్మాణ ప్రతిపాదన ముందుకు సాగలేదు.

చందాలు వేసుకుని రహదారి నిర్మించుకున్నా..

వేసవిలో నదిలో నీటి ప్రవాహం పెద్దగా ఉండకపోవడంతో పలు గ్రామాల ప్రజలు చందాలు వేసుకుని 2018 నుంచి 2023 వరకు పలుమార్లు తాత్కాలికంగా గ్రావెల్, రాతి పేర్పుతో మార్గాన్ని ఏర్పాటు చేసుకోవడం, ఆ తరువాత వర్షాలకు నది ఉధృతి పెరిగి ఆ మార్గం కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. మళ్లీ తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసుకున్నా ప్రస్తుతం రాకపోకలకు అనుకూలంగా లేదు. భారీ వర్షాలు కురిస్తే ఈ రహదారి కూడా కొట్టుకుపోతుందని ఆయా గ్రామాల వాసులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా వంతెన నిర్మాణం జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



తాత్కాలికంగా నదిపై మరో చోట దారిని ఏర్పాటు చేసుకున్న దృశ్యం

ఉమెన్ సేఫ్టీ సెల్ ప్రారంభం

అనకాపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉమెన్ సేఫ్టీ సెల్‌ను కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంత్రి, కలెక్టర్, ఎస్పీగా మహిళలే ఉండడం ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ మహిళలపై జరిగే హింసలను అరికట్టేందుకు ఉమెన్ సేఫ్టీ సెల్ అనుబంధంగా పని చేస్తుందని చెప్పారు. విద్యా సంస్థలు, మహిళలు పని చేసే కార్యాలయాలు, ప్రదేశాలు, గ్రామాల్లో మహిళా పోలీసులతో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మహిళల భద్రతకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ దేవప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, లక్ష్మణమూర్తి, అచ్యుతాపురానికి చెందిన సెయింట్ గోబెన్ సంస్థ ప్రతినిధి సర్వన్‌కుమార్, శివప్రసాద్ తదితరులు హాజరయ్యారు.





ఉమెన్ సేఫ్టీ సెల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక

వెంకన్నపాలెం సమీపంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గొయ్యి



మూన్నాళ్ల ముచ్చటే

- మళ్లీ తప్పని గోతుల కష్టాలు

మండలంలోని వెంకన్నపాలెం సమీపంలో బీఎన్ రోడ్డు మళ్లీ గోతులమయంగా మారింది. రెండు వారాల క్రితం ఇక్కడి గొయ్యిని ఆర్ అండ్ బీ అధికారులు సిమెంట్ కాంక్రీట్‌తో పూడ్చారు. అయితే గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు కాంక్రీట్ కొట్టుకుపోయి మళ్లీ యథావిధిగా గొయ్యి దర్శనమిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - చోడవరం

తాగునీటికి కటకట

- రెండు రోజులుగా కొళాయి నీరు రాకపోవడంతో ఇబ్బందులు
- పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, సెప్టెంబరు 4: మునిసిపాలిటీలో పలు చోట్ల రెండు రోజులుగా కొళాయి నీరు రాకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటికి అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఎస్.రాయవరం మండలం సోముదేవునిపల్లి వద్ద ఉన్న వరహానదిలో ఏర్పాటు చేసిన మంచినీటి పథకం పైపులైను ద్వారా ఎలమంచిలి మండలంతో పాటు మునిసిపాలిటీకి తాగునీరు సరఫరా అవుతుంది. అయితే సోమవారం పైపులైను మరమ్మతుకు గురికావడంతో కొళాయిల నుంచి నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో పట్టణంలోని కొత్తపేట, మిలట్రీ కాలనీ, ధర్మవరం, నాగేంద్ర కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో తాగునీటికి జనం ఇబ్బందులు పడ్డారు. ప్రత్యామ్నాయంగా నీళ్ల ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో నీరు అందడం లేదని మహిళలు వాపోతున్నారు. దీనిపై మునిసిపల్ ఏఈ గణపతి సుబ్బారావును వివరణ కోరగా పైపులైన్ మరమ్మతు పనులు పూర్తయ్యాయని, గురువారం నుంచి కొళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తామని చెప్పారు.

గందరగోళంగా సదరం క్యాంపు

జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో దివ్యాంగులు రావడంతో రద్దీ

- సదుపాయాల కల్పనలో అధికారులు విఫలం
- శిబిరం రద్దు
- మండలాలవారీగా నిర్వహించనున్నట్టు ప్రకటన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 4:

స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం వద్ద బుధవారం జరగాల్సిన సదరం క్యాంప్ గందరగోళానికి దారి తీసింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో దివ్యాంగులు కుటుంబసభ్యులతో కలిసి రావడంతో కేంద్రం వద్ద రద్దీ నెలకొంది. లెక్కకు మించి రావడంతో సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. అసలే బాలల సత్వర చికిత్సా కేంద్రం చిన్నది కావడంతో పాటు అధికంగా దివ్యాంగులు, కుటుంబసభ్యులు తరలి రావడంతో లోపలికి వెళ్లిన దివ్యాంగులు కిక్కిరిసిపోయి ఇబ్బందులు పడ్డారు. బయట కూడా భారీగా దివ్యాంగులు పడిగాపులు కాశారు.



కేంద్రంలో కిక్కిరిసిన దివ్యాంగులు, కుటుంబ సభ్యులు

రాష్ట్ర ప్రభుత్వం 80 శాతానికి పైబడి వైకల్యం ఉన్న దివ్యాంగులకు రూ.15 వేలు పింఛన్ ఇచ్చే సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో ఆధ్వర్యంలో బుధవారం సదరం క్యాంప్ నిర్వహిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధిక సంఖ్యలో జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు, వారి కుటుంబసభ్యులు తరలివచ్చారు. దీంతో దివ్యాంగులకు పరీక్షలు చేసే కేంద్రంతో పాటు ఎన్టీఆర్ వైద్యాలయం రోడ్డు కిక్కిరిసిపోయింది. దీని వల్ల ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వైద్యాలయంలోకి వెళ్లే వారు, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన దివ్యాంగులను పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణలు సిబ్బందితో ఆటోల్లో కూర్చోబెట్టారు. జనసేన నాయకులు క్యాంప్ వద్దకు వచ్చి దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను చూసి ఈ విషయాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన కలెక్టర్‌తో మాట్లాడి మండలాల వారీగా క్యాంప్‌ల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్‌తో ఎమ్మెల్యే మాట్లాడి క్యాంప్ నిర్వహణ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. క్యాంప్ కార్యాలయం వద్ద ఉన్న జనసేన నాయకులు ఆళ్ల రామచంద్రరావు, దూలం గోపి, రాము తదితరులు దివ్యాంగులకు మంచినీళ్ల బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. క్యాంప్ రద్దయినట్టు అధికారులు ప్రకటించడంతో దివ్యాంగులు వెనుదిరిగారు. ఈ విషయమై ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావును వివరణ కోరగా ... మిగతా 8వ పేజీలో



కేంద్రం ముందు గుమిగూడిన దివ్యాంగులు, కుటుంబ సభ్యులు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 38 మంది ఎంపిక

- నేడు అనకాపల్లిలో ప్రదానం

అనకాపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు 38 మంది ఎంపికయ్యారు. వీరంతా గురువారం అనకాపల్లి పట్టణంలోని గుండాల జంక్షన్‌లో గల ఎస్ఆర్ శంకర్ జీవీఎంసీ సమావేశ మందిరంలో జరగనున్న ఉపాధ్యాయుల దినోత్సవంలో ఈ పురస్కారాలను అందుకోనున్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా ఎంపికైన ఉపాధ్యా యుల జాబితాను డీఈవో ఎంవీ లక్ష్మమ్మ బుధవారం విడుదల చేశారు.

జిల్లాస్థాయి పురస్కారాలకు ఎలమంచిలి మండలం పులపర్తి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీరామ్మూర్తి, బుచ్చెయ్యపేట మండలం తురకలపూడి జడ్పీ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.జె.రవీంద్రబాబు, ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరు ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల సుధాకర్ పురస్కారాలు అందుకోనున్నారు.

స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో...

సీహెచ్‌వీ సత్యనారాయణ (జడ్పీ హెచ్‌ఎస్, పెదబొడిగల్లం, నక్కపల్లి), వై.శ్రీనివాసరావు (జడ్పీహెచ్‌ఎస్, తాళ్లపాలెం), కె.వీరునాయుడు (జడ్పీహెచ్‌ఎస్, ఉప్పరాపల్లి), పి.రమాకాంత్‌బాబ్జి (జీవీఎంసీ స్కూల్, అనకాపల్లి), ఎస్.ప్రభాకర్ (జడ్పీహెచ్‌ఎస్, జన్నవరం), ఎ.శ్రీనివాసరావు (జడ్పీహెచ్‌ఎస్, అప్పలరాజుపురం), కె.సంపతరావు (జడ్పీహెచ్‌ఎస్, ఉప్పరాపల్లి), భాస్కరశారద (జడ్పీహెచ్‌ఎస్, రేవుపోలవరం), బి.పద్మజరవిబాబు (జడ్పీహెచ్‌ఎస్, గుంటపల్లి), కేకేఎల్ఎన్ ధర్మారావు (జడ్పీహెచ్‌ఎస్, గుర్రాజుపేట), ఎం.భానోశ్రీ (జడ్పీహెచ్‌ఎస్, పెదగుమ్ములూరు), సీహెచ్.విమాలాదేవి (జడ్పీహెచ్‌ఎస్, డీహెచ్ అగ్రహారం), జె.రాణిఫ్లోరెన్స్ (జడ్పీహెచ్‌ఎస్, ఎలమంచిలి), పి.వరలక్ష్మి (జడ్పీహెచ్‌ఎస్, కొత్తపేట), జె.అమృతరావు (జడ్పీహెచ్‌ఎస్, ఎ.కోడూరు), వై.శ్రీనివాసరావు (జడ్పీహెచ్‌ఎస్, గుంటపల్లి), డి.పినకాపిని (ఎంపీయూపీఎస్, సబ్బవరం)

ఎస్‌జీటీ కేటగిరీ ఉపాధ్యాయులు...

రొబ్బి లక్ష్మి (ఎంపీపీఎస్, వెంకటాపురం), వి.శ్రీదేవి (ఎంపీపీఎస్, పాయకరావుపేట), పిల్లా వెంకటఆనంద్ (ఎంపీపీఎస్, వీరనారాయణం, మాడుగుల), మళ్ల శ్రీనివాస్ (ఎంపీపీఎస్, చాకలిపురం, ఎలమంచిలి), రావాడ త్రినాథరావు (ఎంపీయూపీఎస్, ఆర్లె కె.కొత్తపాడు), రావాడ సునీత (ఎంపీపీఎస్, వీఎన్‌పేట, నర్సీపట్నం), టెక్కి రాజ్‌కిరణ్ (ఎంపీపీఎస్, మసయ్యపేట), ఎన్.వీరాంజనేయులు (ఎంపీపీఎస్, పీవీపాలెం), బీవీపీ మహేశ్వరి (ఎంపీపీఎస్, మంచాల, చీడికాడ) ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

పెద్దేరులో గల్లంతైన వృద్ధుడి మృతి



నదిలో నుంచి మృతదేహం తీసుకొస్తున్న యువకులు

చోడవరం, సెప్టెంబరు 4: మండలంలోని గౌరీపట్నంలో మంగళవారం మధ్యాహ్నం పెద్దేరు నదిలో ప్రవాహ ఉధృతికి కొట్టుకొనిపోయిన వృద్ధుడు ఆకుల నాగరాజు (62) మృతి చెందాడు. అతడి మృతదేహం బుధవారం మధ్యాహ్నం లభ్యమైంది. పెద్దేరు నది ఆవల ఉన్న పొలాలకు వెళ్లేందుకు నది దాటే క్రమంలో నాగరాజు ప్రవాహ ఉధృతికి నదిలో గల్లంతైన సంగతి తెలిసిందే. నాగరాజు ఆచూకీ కోసం మంగళవారం మధ్యాహ్నం నుంచి అగ్నిమాపక సిబ్బంది, స్థానిక యువకులు గాలించినా ఫలితం కనిపించలేదు. అయితే గౌరీపట్నం యువకులు కొందరు నది వెంబడి గాలింపు చర్యలు కొనసాగించగా, చివరకు బెన్నవోలు గ్రామ సమీపంలో నాగరాజు మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని వెలికితీసి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 4: తీవ్ర గాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందినట్టు పట్టణ ఎస్‌ఐ ఎ.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. అనకాపల్లి మండలం సిరసపల్లికి చెందిన తెప్పల రమేష్ (42) మార్బుల్స్, భవన నిర్మాణ పనులు చేస్తుంటాడన్నారు. ఈ నెల రెండో తేదీ ఉదయం ఉడ్‌పేట వద్దకు పనుల కోసం రాగా, ఆయనకు ఫిట్స్ రావడంతో వెనుక ఉన్న ఐరన్ తలుపులపై పడి తీవ్ర గాయాలకు గురయ్యాడని ఎస్‌ఐ చెప్పారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు సమాచారం అందిందన్నారు. మృతుడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాలిక హత్య కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలు

విశాఖపట్నం (లీగల్), సెప్టెంబరు 4 : బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఆమె మృతికి కారణమైన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 50 వేలు జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం జడ్జి ఆనంది బుధవారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అలాగే బాధితురాలి కుటుంబ సభ్యులకు నిందితుడు రూ.1,50 లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వం రూ. 3 లక్షలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. బాధితురాలు (13) తన కుటుంబ సభ్యులతో కలిసి దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక అపార్టమెంట్‌లో నివసిస్తున్నారు. అక్కడికి సమీపంలోనే దిగుమర్తి నరేష్ (28) కార్పెంటర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో బాలికకు నరేష్‌తో పరిచయం ఏర్పడింది. అది శారీరక సంబంధానికి దారి తీసింది. 2021 అక్టోబరు 5న రాత్రి నరేష్ ఫోన్ చేయడంతో బాలిక అతని రూమ్‌కు వెళ్లింది. ఈలోపు బాలిక కనిపించలేదని ఆమె తండ్రి చుట్టుపక్కల వెతకడం ప్రారంభించాడు. గమనించిన నరేష్ బాలికను తన గది వెనుక వైపు నుంచి బయటకు వెళ్లిపొమ్మని హెచ్చరించాడు. తల్లిదండ్రులకు భయపడిన బాలిక అదే అపార్టమెంట్‌పైకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకింది. తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో కేసును దర్యాప్తు చేసిన దువ్వాడ పోలీస్ అధికారులను న్యాయమూర్తి అభినందించారు.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 4: వరుస పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొన్ని ట్రిప్పులు కొనసాగించనున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. వీటిలో కొచువేలి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (06081) ఈనెల 20 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు కొచువేలిలో బయలుదేరి మర్నాడు రాత్రి 10.52 గంటలకు దువ్వాడ, ఆదివారం మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి (06082) నంబరు గల రైలు ఈనెల 23 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 2.20 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 4.18 గంటలకు దువ్వాడ, బుధవారం ఉదయం 9.55 గంటలకు కొచువేలి చేరుతుంది.

తిరునెల్వేలి-షాలిమార్ ఎక్స్ ప్రెస్ (06087) ఈనెల 12 నుంచి నవంబరు 28 వరకు ప్రతి గురువారం తెల్లవారుజాము 1.50 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.47 గంటలకు దువ్వాడ, రాత్రి 9.00 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈనెల 14 నుంచి నవంబరు 30 వరకు ప్రతి శనివారం సాయంత్రం 5.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.52 గంటలకు దువ్వాడ, సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు తిరునెల్వేలి చేరుతుంది. కొయంబత్తూరు-బరౌని ఎక్స్‌ప్రెస్ (06059) ఈనెల పది నుంచి నవంబరు 26 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.50 గంటలకు కొయంబత్తూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ, మర్నాడు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుతుంది. అలాగే, ఈ ఎక్స్‌ప్రెస్ (06060) ఈనెల 13 నుంచి 29వ తేదీ వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరి ఆదివారం ఉదయం 3.48 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 3.45 గంటలకు కొయంబత్తూర్ చేరుతుంది. ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (06085) ఈనెల 13 నుంచి 29 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.00 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.03 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 3.30 గంటలకు పాట్నా చేరుతుంది. తిరిగి ఈనెల 16 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం రాత్రి 11.45 గంటలకు పాట్నాలో బయలుదేరి బుధవారం తెల్లవారుజాము 1.05 (మంగళవారం అర్ధరాత్రి) దువ్వాడ, గురువారం ఉదయం 10.30 గంటలకు ఎర్నాకులం చేరుతుంది.

దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దువ్వాడ మీదుగా షాలిమార్, చెన్నై సెంట్రల్, సంత్రాగచ్చి, సికింద్రాబాద్ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే.సందీప్ తెలిపారు. షాలిమార్-చెన్నై సెంట్రల్-షాలిమార్ 02841 నంబరు గల రైలు ఈనెల 30 నుంచి నవంబరు 18 వరకు ప్రతి సోమవారం ఉదయం 8.30 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 8.08 గంటలకు దువ్వాడ, మంగళవారం రాత్రి 11.20 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుతుంది. తిరిగి అక్టోబరు ఒకటి నుంచి నవంబరు 20 వరకు ప్రతి బుధవారం ఉదయం 4.30 గంటలకు చెన్నైలో బయలుదేరి అదేరోజు రాత్రి 7.30 గంటలకు దువ్వాడ, గురువారం ఉదయం 11.20 గంటలకు షాలిమార్ చేరుతుంది

సంత్రాగచ్చి-సికింద్రాబాద్-సంత్రాగచ్చి.. 08845 నంబరు గల రైలు అక్టోబరు నాలుగు నవంబరు 15 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.55 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు ఉదయం 3.55 గంటలకు దువ్వాడ, శనివారం సాయంత్రం 6.40 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. తిరిగి అక్టోబరు ఐదు నుంచి నవంబరు 16 వరకు ప్రతి శనివారం రాత్రి 7.50 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.40 గంటలకు దువ్వాడ, రాత్రి 11.55 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది.

నేడు తిరువనంతపురం, షాలిమార్ రైలు రద్దు

జత రేక్ కొరత నేపథ్యంలో వయా విశాఖ మీదుగా తిరువనంతపురం నుంచి షాలిమార్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ (22642) రైలును గురువారం రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం తెలిపారు. కాగా విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739), సికింద్రాబాద్-విశాఖ గరీబ్‌రథ ఎక్స్‌ప్రెస్ (12740), చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840) రైళ్లు బుధవారం (4న) రద్దయ్యాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

వినాయక విగ్రహాలకు ఖ్యాతిగాంచిన చౌడువాడ



వివిధ ఆకృతులలో గణనాథుడు

- వివిధ రూపాల్లో గణేషుడి ప్రతిమలు
- మూడు కుటుంబాలకు చెందిన కళాకారుల ప్రతిభ
- తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి గిరాకీ

కె.కోటపాడు, సెప్టెంబరు 4 : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆకర్షణీయమైన వినాయక బొమ్మల తయారీ ఎక్కడ అంటే.. అది కె. కోటపాడు మండలం చౌడువాడ అని చెబుతారు. అంతటి పేరు సంపాదించుకున్నారు అక్కడి మూడు కుటుంబాలకు చెందిన కళాకారులు. ఈ నెల 7న వినాయకచవతి. ఏ వీధిలో చూసినా గణనాథుని విగ్రహాలతో కూడిన మండపాలే దర్శనమిస్తాయి. ఇంచుమించు ఈ పరిసరాల్లో కనిపించే ఈ విగ్రహాలన్నీ తయారయ్యేది చౌడువాడలోనే అంటే అతిశయోక్తి కాదు. వినాయకవిగ్రహాల తయారీలో ఈ గ్రామానికి రాష్ట్ర స్థాయిలో పేరుంది. ఇక్కడ వివిధ రకాలు భంగిమల్లో రంగురంగులతో ఆకర్షణీయంగా వినాయక విగ్రహాలను రూపొందిస్తారు. రాజమండ్రి, అమలాపురం, పిఠాపురం, పాలకొల్లు, విశాఖ తదితర ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతుంటాయి. చౌడవాడకు చెందిన మాకారపు ఈశ్వరరావు, ఉరుము ఈశ్వరరావు, మాకారపు శంకరరావు వినాయక విగ్రహాల తయారీలో ఘనతకెక్కారు. అడుగు ఎత్తు నుంచి 15 అడుగుల ఎత్తు వరకు రూపాల్లో తయారయ్యే విగ్రహాలు రూ.వెయ్యి నుంచి 20 వేల రూపాయల వరకు ధర పలుకుతాయి.



పంచముఖ ఆంజనేయస్వామి రూపంలో గణపతి



చౌడువాడలో వినాయక విగ్రహాలకు రంగులద్దుతున్న దృశ్యం

ప్రభుత్వ సహకారం అవసరం




పదేళ్లుగా ఇదే వృత్తిలో జీవనం సాగిస్తున్నాను. విగ్రహాలకు అద్దే రంగుల దగ్గర నుంచి వివిధ రకాల మెటీరియల్స్ విపరీతంగా ధరలు పెరిగిపోయాయి. అధిక లాభం లేకపోయినా పది మందికీ ఉపాధి కల్పిస్తున్నా నన్న సంతోషం మాత్రం మిగుతులోంది. ఈ సమయంలో పెయింటర్స్‌కు పూర్తి స్థాయిలో పని దొరుకుతుంది. ఈ పరిశ్రమకు ప్రభుత్వం రాయితీపై రుణాలు అందజేసి ఆదుకోవాలి.

- మాకారపు ఈశ్వరరావు,
విగ్రహాల తయారీదారుడు








శివ పార్వతులతో వినాయకుడు

'కొక్కిరాపల్లి' నువ్వు వంగడానికి త్వరలో జాతీయస్థాయి గుర్తింపు

- ఇప్పటి వరకు ఇక్కడి నుంచి ఐదు రకాల వంగడాలు రాష్ట్రస్థాయిలో విడుదల
- నూతన రకం వైఎల్ఎం-146 ద్వారా అరుదైన కీర్తి
- వివరాలు వెల్లడించిన ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు



కొక్కిరాపల్లి పరిశోధనా కేంద్రంలోని కొత్త రకం వంగడాలు



వైఎల్ఎం-146 రకం నువ్వు పంట

ఎలమంచిలి, సెప్టెంబ 4 : జిల్లాలోని ఎలమంచిలి సమీపం కొక్కిరాపల్లిలో గల ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం రూపొందించిన నూతన నువ్వు వంగడాలు వైఎల్ఎం-146కు త్వరలో జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. త్వరలో ఇది విడుదల కానుంది. నువ్వు పంట, నువ్వు ఆధారిత పంటల సరళిపై సమగ్రమైన అభివృద్ధి చేసేందుకు 1960వ సంవత్సరంలో కొక్కిరాపల్లిలో ఏర్పాటు చేసిన ఈ పరిశోధనా స్థానం చరిత్రలో తొలిసారిగా జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. ఇందుకు సంబంధించిన వివరాలను పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంబీజీఎస్ కుమారి, మరో శాస్త్రవేత్త డాక్టర్ ఏబీఎం శిరీషా బుధవారం వెల్లడించారు. ఈ ఏడాది జూలైలో కోయంబత్తూరులో జరిగిన నూనె గింజల యాన్యువల్ గ్రూప్ వర్క్‌షాపులో ఎంపిక నిమిత్తం ఇక్కడి నుంచి సెంట్రల్ కమిటీకి ఈ నూతన వంగడాన్ని పంపించారు. సదరు కమిటీకి 13 రకాలు నువ్వులు దేశవ్యాప్తంగా ఎంపికకు నామినేషన్లు వచ్చాయి. ఇందులో ఐదు రకాల నువ్వు గుర్తింపునకు రాగా, వీటిలో కొక్కిరాపల్లి పరిశోధనా స్థానంలో రూపొందించిన వైఎల్ఎం-146 రకం ఒకటి కావడం విశేషం. ఈ రకం జాతీయ స్థాయిలో జోన్-2కు ఎంపికకు గుర్తించారు. దీనిని త్వలో అధికారికంగా విడుదల చేయనున్నారు.

ఇప్పటి వరకూ విడుదల చేసిన రకాలు

ఇప్పటి వరకూ ఈ పరిశోధనా స్థానం నుంచి విడుదల చేసిన రకాలు ఇవి. 1974వ సంవత్సరంలో గౌరి, 1978లో మాధవి, 1993లో వరాహ, 1993లో గౌతమ్, 2009లో శారదా రకాలను రాష్ట్ర స్థాయిలో విడుదల చేశారు.

వైఎల్ఎం-146 రకం విశేషాలు

తొలిసారిగా జాతీయ స్థాయిలో వైఎల్ఎం-146 రకం విడుదల కానుంది. దీని పంట కాలం 80 నుంచి 85 రోజులు. ఎకరాకు 600 నుంచి 700 కేజీల దిగుబడి వస్తుంది. నూనె శాతం 49 ఉంటుంది. ముదురు గోధమ రంగు రకాలమీద ఈ పరిశోధనా స్థానంలో ప్రయోగాలు చేయడం జరుగుతుంది. జాతీయ స్థాయిలో గుర్తింపు రానున్న వైఎల్ఎం-146 రకం సుమారు పది సంవత్సరాల పాటు శ్రమించి రూపకల్పన చేశామని, ఇందులో శాస్త్రవేత్తలు డాక్టర్ రాజబాపారావు, డాక్టర్ గంగాధర్, డా. శిరీషలు కృషి ఉందని వారు వివరించారు.

తేగాడ మోడల్ స్కూల్‌లో వసూళ్ల పర్వం!

- ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.200 వరకు వసూలు
- బయటకు పొక్కడంతో కొందరికి వాపసు
- విచారణకు ఆదేశించామన్న డీఈవో

కశింకోట, సెప్టెంబరు 4: మండలంలోని తేగాడ మోడల్ స్కూల్‌లో వసూళ్ల పర్వం ఆలస్యంగా బయటపడింది. స్థానికులు, పాఠశాల విద్యార్థులు తెలిపిన వివరాలివి. తేగాడ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు 600 మంది ఉన్నారు. వీరిలో తొమ్మిది నుంచి పది, ఇంటర్మీడియట్ చదువుకునే వంద మంది విద్యార్థులకు వసతి గృహ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తోంది. పాఠశాల, కళాశాల ఆవరణలో ఉన్న మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించేందుకు ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.200లు చొప్పున బలవంతపు వసూళ్ల చేసినట్టు సమాచారం. అయితే ఈ విషయం బయటకు పొక్కడంతో ప్రిన్సిపాల్ వీరిలో కొందరు విద్యార్థులకు వసూళ్ల చేసిన డబ్బులు తిరిగి ఇచ్చినట్టు తెలిసింది. ఉన్నతాధికారులు విచారణ జరిపి ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

దీనిపై డీఈవో వెంకటలక్ష్మమ్మను వివరణ కోరగా, తేగాడ మోడల్ స్కూల్‌లో అంశంపై విచారణ చేపడతామన్నారు. డిప్యూటీ డీఈవోను సమగ్ర విచారణ చేయాలని ఆదేశించినట్టు చెప్పారు. నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రతి గ్రామంలో హిందూ సమితి

- వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 4: ప్రతి గ్రామానికి హిందూ సమితి ఏర్పాటు చేయడం జరిగిందని, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ అన్నారు. జంపెన శివాలయం, కేజేపురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హిందూ సమితి సభ్యులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్ 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి హిందూ పరిరక్షణ కోసం శ్రమిస్తున్నామన్నారు. హిందూ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని, ఈ విషయంలో యువత మరింత చొరవ చూపాలన్నారు. ఇతర మతాలను హిందూ మతం ఎప్పుడూ గౌరవిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీతారామ్, మండల కార్యదర్శి రాపేటి రామకొండారావు, శోభారాణి, సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భాద్రపద మాసంలో అప్పన్న ఆలయ వైదిక ఉత్సవాలు

సింహాచలం, సెప్టెంబరు 4: వరాహలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో బాద్రపద మాసంలో పలు వైదిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడు దల చేశారు. ఈనెల 5న స్వర్ణ పుష్పార్చన, 6న తాయారు సన్నిధిలో సహస్రనామ కుంకుమార్చన, సాయంత్రం బేడా తిరువీధి, 8న స్వాతి నక్షత్ర హవనం, 9న శ్రీనమ్మాళ్వార్ తిరు నక్షత్ర పూజలు, 12న మనవాళ మహామునుల మాస తిరు నక్షత్ర పూజలు, 13న ఉదయం తయార్ సన్నిధిలో సహస్రనామ కుంకుమార్చన, స్వామివారి పవిత్రోత్సవాలు పురస్కరించుకుని సాయంత్రం అంకురార్పణ జరగనుంది. అలాగే 14న ఏకాదశి పవిత్రాదివాసం, పవిత్ర పవిష్ట, గ్రామ తిరువీధి, 15 పవిత్ర సమర్పణ, గ్రామ తిరువీధి, కొండదిగువ వేంకటేశ్వరస్వామి దేవళంలో సుదర్శన హవనం, 16న పూర్ణాహుతి, పవిత్ర విసర్జనం, ఆరాధన, తిరువీధి, 17న నృసింహ మాస జయంతి, ఏకాంత స్నపన తిరుమంజనం, పవిత్రోత్సవాల సమాప్తి, సాయంత్రపు తిరువీధి, 18న బాద్రపద మాస పూర్ణిమ గ్రామ తిరువీధి, 19న స్వర్ణ పుష్పార్చన, మహాలయ పక్ష ప్రారంభం, 20న అమ్మవారి సన్నిధిలో శుక్రవార కుంకుమ పూజలు, బేడా తిరువీధి, 22న స్వర్ణపుష్పార్చన, 23న మాధవధార వేణుగోపాలస్వామి సన్నిధిలో అష్టాక్షరీ మంత్ర హవనం, 26న స్వర్ణ పుష్పార్చన, సింహగిరిపై సీతారామస్వామి ఆలయంలో సంక్షిప్త రామాయణం, షడక్షరీ మంత్ర హవనం, 27న అమ్మవారి సన్నిధిలో సహస్ర కుంకుమార్చన, సాయంత్రం బేడా తిరువీధి, 28న బాద్రపదమాస బహుళపక్ష ఏకాదశి స్వర్ణ తులసీ దళార్చన, గ్రామతిరువీధి, 29న స్వర్ణ పుష్పార్చన, ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

- నిర్వాహకులకు ఎస్పీ దీపిక సూచన



ఎం.దీపిక, ఎస్పీ

అనకాపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో అంతా నిర్వహించుకోవాలని ఎస్పీ ఎం. దీపిక బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. గణేశ్ మండపాలు, పందిళ్ల ఏర్పాటు, ఊరే గింపులకు తప్పనిసరిగా ఆయా పోలీసు స్టేషన్ల ద్వారా అనుమతి పొందాలని వివరించారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, సీసీ కెమెరాలు పనిచేసే విధంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. మండపాల్లో రాత్రి వేళ దీపారాధన సమయంలో ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా పూర్తి జాగ్రత్తలు పాటించాలని వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, ఉత్సవాల పేరుతో బలవంతంగా చందాలు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని, ఊరేగింపు సందర్భంగా బాణసంచా కాల్చరాదని స్పష్టం చేశారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్దేశించిన గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తిచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం గృహ నిర్మాణ సంస్థ అధికారులతో ఏర్పాటైన సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 6,276 రూఫ్ లెవెల్‌లో ఉన్న గృహ నిర్మాణాలను వంద రోజుల్లో పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లబ్ధిదారులకు ఉపాధి హామీ కింద 90 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. చీడికాడ, అనకాపల్లి రూరల్, కోటవురట్ల, గొలుగొండ, అచ్యుతాపురం మండలాల ఏఈలు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో మెరుగైన పనితీరు కనబర్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ వై.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి మంజులవాణి, గృహ నిర్మాణశాఖ ఈఈ, డీఈ, ఏఈలు, వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలాల వారీగా సదరం క్యాంపులు

- ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 4: పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం ఎదురుగా గల బాలల సత్వర చికిత్సా కేంద్రంలో ఈ నెల 5వ తేదీ గురువారం నుంచి 17వ తేదీ వరకు మండలాల వారీగా దివ్యాంగులకు సదరం క్యాంపులు నిర్వహించనున్నామని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. తలసేమియా మేజర్, సికిల్ సెల్ వ్యాధి, తీవ్రమైన హిమోఫిలియా, ద్వైపాక్షిక ఎలిఫెంట్ యాసిస్ (బోదవ్యాధి), పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తి, మంచానికే పరిమితమైన వారు, వీల్‌చైర్‌కే పరిమితమైనవారు, తీవ్రమైన కండరాల క్షీణత కేసులు, ప్రమాద బాధితులు, చక్రాల కుర్చీ లేక మంచానికి పరిమితమైనవారు, తీవ్రమైన కిడ్నీ వ్యాధిగ్రస్తులు, బహుళ వైకల్యం లెప్రసీ వంటి వారు, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేయించుకుని ఇలా అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి సదరం క్యాంప్‌లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సర్టిఫికెట్లు ఇవ్వనున్నామన్నారు. పైన తెలిపిన వాటిలో పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తి మంచానికి, వీల్‌చైర్‌కే పరిమితమైన, తీవ్రమైన కండరాల క్షీణత, ప్రమాద బాధితులు, చక్రాల కుర్చీ, మంచానికి పరిమితమైన వారు 80 శాతానికి పైబడిన సదరం సర్టిఫికెట్ తెచ్చుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు.

5వ తేదీన రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల దివ్యాంగులకు సదరం క్యాంప్‌లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 6న పరవాడ, అనకాపల్లి మండలం, టౌన్, చోడవరం మండలాలు, 9న సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి, 10న చీడికాడ, మాడుగుల, బుచ్చెయ్యపేట, 11న కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, 12న రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం, 13న నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం, 17న కోటవురట్ల, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల దివ్యాంగులకు సదరం క్యాంప్ నిర్వహించనున్నామని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు ఎన్టీఆర్ వైద్యాలయంలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

▸ డీపీవో శిరీషారాణి ఆదేశం ▸ సేంద్రియ ఎరువు తయారీకి సూచనలు



బోదివలస సంపద కేంద్రంలో వానపాములు విడుదల చేస్తున్న డీపీవో

సబ్బవరం, సెప్టెంబరు 4 : గ్రామాల్లోని సంపద కేంద్రాలు అన్నింటినీ వినియోగంలోకి తీసుకు రావాలని డీపీవో ఆర్.శిరీషారాణి ఆదేశించారు. మండలంలోని ఎల్లుప్పి, బోదువలస, గుల్లేపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా సంపద కేంద్రాలను పరిశీలించి, వాటిలో సేంద్రియ ఎరువు తయారీకి అవసరమైన వానపాములు విడిచిపెట్టారు. ఆయా ఆవరణలో మొక్కలు నాటారు. రోడ్డు పక్కగల చెత్తా చెదారాన్ని దగ్గరుండి కేంద్రాలకు తరలింపజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంద కేంద్రాల్లో సేంద్రియ ఎరువులు ఉత్పత్తి చేయడం వల్ల పంచాయతీలకు ఆదాయంతో పాటు వ్యవసాయ భూముల్లో నాణ్యమైన పంటలు పండించవచ్చునన్నారు. అన్ని సంపద కేంద్రాల్లో వానపాములు విడదల చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా కార్యదర్శులు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంపద కేంద్రాల జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఈవోపీఆర్డీ మహేశ్, సర్పంచులు ఉగ్గిన దేముడమ్మ, నేబర్తి శ్రీను, బండారు మంగ, శ్రీను, ఎల్లాజీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

బిర్యానీ, న్యూడిల్స్ పాయింట్లలో తనిఖీలు

▸ డిప్యూటీ తహసీల్దార్, శానిటేషన్ సిబ్బందికి జెడ్సీ సూచన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 4 : పట్టణంలోని చికెన్, న్యూడిల్స్, బిర్యానీ పాయింట్లలో తనిఖీలు నిర్వహించాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు ఆదేశించారు. బుధవారం జోనల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, శానిటేషన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వర్షాలు కురుస్తున్నందున పలు చోట్ల ఆహార పదార్థాలలో నాణ్యత కొరవడిందని తెలుస్తున్నందున అన్ని ప్రాంతాల్లో నిర్వహించే బిర్యానీ, న్యూడిల్స్ చికెన్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రధా నంగా ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే నూనెలపై కూడా దృష్టి సారించాలన్నారు.

'ఉపాధ్యాయులు నిరంతర జ్ఞాన సముపార్జన చేయాలి'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీహెచ్.విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, సెప్టెంబరు 4 : ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా జ్ఞాన సముపార్జన చేయడం ద్వారా అన్ని విషయాలు తెలుసుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయాలని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న గురుపూజోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు నిర్వహించిన చర్చావేదిక, ఆటల పోటీలు, నృత్య, నాటక, బృందగాన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రిన్సిపాళ్ళు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది



నారాయణపురం వద్ద జోరుగా ప్రవహిస్తున్న మేజర్ శారదానది

రాంబిల్లి, సెప్టెంబరు 4 : అల్పపీడనం ప్రభావంతో భారీగా కురిసిన వర్షాలకు నదులు, చెరువులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ఈ ప్రాంతంలోని పంట పొలాల్లో నీరు పుష్కలంగా చేరడంతో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. కొత్తూరు, నారాయణపురం వద్ద మేజర్, మైనర్ శారదా నదులు జలకళను సంతరించుకున్నాయి. ఈ నదుల పరిధిలోని ఆయకట్టు భూముల్లో నాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. రాంబిల్లి మండలంలోని ఖరీఫ్‌లో ఏటా 2283 హెక్టార్లలో రైతులు వరినాట్లు వేస్తుంటారని, ఇప్పటికే నారు సిద్ధంగా ఉన్న రైతులు 60 శాతం మేర నాట్లు వేశారని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత తెలిపారు. మరో పది రోజుల్లో శతశాతం నాట్లు పూర్తి కాగలవన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

అవార్డులకు 38 మంది ఎంపిక

... 5వ పేజీ తరువాయి

కె.రవికుమార్ (ఎంపీపీఎస్, రత్నంపేట, రోలుగుంట), బి.సూర్యనారాయణ (ఎంపీపీఎస్, వెలమకాయలపాలెం, రోలుగుంట), జి.రాజశేఖర్ (ఎంపీపీఎస్, చిన్నగొల్లపాలెం, ఎలమంచిలి), ఏవీ రామచంద్రరావు (జీవీఎంసీ టౌన్, అనకాపల్లి), ఎ.రమణమూర్తి (ఎంపీపీఏఎస్, లింగంపేట, గొలుగొండ), ఎ.అప్పాజీరావు (ఎంపీయూపీఎస్, కొక్కిరాపల్లి, ఎలమంచిలి), కె.నూకేశ్వరరావు (జీవీఎంసీ గాంధీగ్రామ్, అనకాపల్లి), వై.నర్సింహమూర్తి (ఎంపీపీఎస్, వైబీ పట్నం, రోలుగుంట), ఎస్‌టీపీ విద్యావతి (ఎంపీపీఎస్, టి.అర్జాపురం, రావికమతం).

గందరగోళంగా సదరం క్యాంపు

... 5వ పేజీ తరువాయి

ఒకేసారి భారీగా దివ్యాంగులు రావడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. డీఎం అండ్ హెచ్‌వో ఆధ్వర్యంలో జరిగే ఈ క్యాంప్‌నకు వైద్యులను సమకూర్చి దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. అయితే నిర్దేశించిన దివ్యాంగుల కంటే అధిక సంఖ్యలో రావడంతో పరిస్థితి మారిందన్నారు. మండలాల వారీగా అందరికీ సమాచారం ఇచ్చి క్యాంపులు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. మధ్యాహ్నం ఆర్థోపెడిక్‌కు సంబంధించి 50 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించామని ఆయన తెలిపారు.

గజానికో గుంత.. ప్రయాణాలకు చింత..

అస్తవ్యస్తంగా మారిన పలు గ్రామాల రహదారులు

▸ పట్టించుకోని అధికారులు

▸ అవస్థలు పడుతున్న వాహనదారులు



మార్టూరు వెళ్లే రహదారిలో మలుపు వద్ద దుస్థితి

అచ్యుతాపురం, సెప్టెంబరు 4 : ఇటు గత ఐదేళ్ల వైసీపీ పాలకుల నిర్లక్ష్యం.., అటు తుఫాన్‌ల కారణంగా కురిసిన భారీ వర్షాలు.. వెరసి పలు రహదారులు రూపుమారి వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. ప్రధానంగా అచ్యుతాపురం మండ లంలోని అచ్యుతాపురం- మార్టూరు రహదారి అత్యంత దారుణంగా తయారైంది. ఎక్కడికక్కడ గోతులు పడడంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. దీనికి తోడు వర్షాలకు ఆ నీరు ఆయా గుంతల్లో చేరడం మరిన్ని ఇబ్బందులకు కారణమవుతోంది. అచ్యుతాపురం- ఎలమంచిలి ప్రధాన రహదారిలో గల అయ్యప్పస్వామి ఆలయం నుంచి మార్టూరు వరకు సమారు నాలుగు కిలోమీటర్ల రోడ్డును మూడు దశాబ్దాల క్రితం నిర్మించారు. ఆ తర్వాత దీని నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో ఇది పూర్తిగా పాడై వాహనదారుల సంగతి



గోతులమయమైన మార్టూరు రోడ్డు

అటుంచితే, నడవడానికి కూడా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రహదారిలో మార్టూరు గ్రామం ఒక్కటే ఉండడంతో ఎవరూ పట్టించుకోవడం లేదనే వాదన వినిపిస్తోంది. కాగా, మార్టూరు గ్రామానికి పక్కనే 500 ఎకరాలు సెజ్ నిర్వాసితులకు కేటాయించి, సుమరు 4500 ప్లాట్లు వేశారు. నిర్వాసిత గ్రామాలను తరలించడంతో నాలుగువేల కుటుంబాలు గృహాలు నిర్మించుకొని సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం)లో నివాసముంటున్నారు. దీంతో అచ్యుతాపురం-మార్టూరు రహదారికి ప్రాధాన్యం ఏర్పడింది. ఇది గుర్తించిన గత టీడీపీ ప్రభుతం 2017లో రూ.1.25 కోట్లతో ఈ రోడ్డును ఐదుమీటర్ల మేరకు వెడల్పు చేసి తారు రోడ్డుగా తీర్చిదిద్దారు. రోడ్డు బాగుండడంతో సెజ్ పునరావాస కాలనీతో పాటు, సెజ్‌లో కర్మాగారాలకు ఉద్యోగులను తీసుకువెళ్లే వాహనాలు, యంత్ర సామగ్రి తీసుకువెళ్లే వాహనాలు ఇటుగానే వెళ్లడం ఆరంభించాయి. అలాగే గతంలో అచ్యుతాపురం నుంచి రాంబిల్లి వెళ్లాలంటే వెదురువాడ, వెంకటాపురం జంక్షన్ మీదుగా వెళ్లేవారు. కానీ ఈ రోడ్డు బాగుపడడంతో మార్టూరు మీదుగా రాంబిల్లి, కొత్తపట్నం, వాడనర్సాపురం, కృష్ణంపాలెం, వెల్చూరు, నాయుడుపాలెం, వై.లోవ, రాజుకోడూరు తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇంత రద్దీగా ఉండే రహదానిని గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. దీంతో గోతులమయంగా మారడంతో పాటు ఎక్కడికక్కడ రాళ్లు తేలి రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలావుంటే, ఈ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, చెట్లు భారీగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

ఛిద్రమైన అసకపల్లి-లంకెలపాలెం రహదారి

సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి. ప్రధానంగా సబ్బవరం నుంచి అసకపల్లి మీదగా లంకెలపాలెం వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. తాజా వర్షాలకు రోడ్డు మరింత ఛిద్రమైంది. అసకపల్లి నుంచి లంకెలపాలెం మధ్య పలుచోట్ల రోడ్డు దారుణంగా తయారైంది. ముడుకుల్లోతుకుపైగా రోడ్డు మధ్యలో గోతులు ఏర్పడ్డాయి. వాటిలో వర్షపు నీరు చేరుతుండడంతో రోడ్డు ఎక్కడో, గొయ్యి ఎక్కడో గుర్తించలేని పలువురు వాహనదారులు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళలో ఈ రహదారిలో ప్రయాణం అంటేనే హడలిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డును నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.





అసకపల్లి నుంచి లంకెలపాలెం వెళ్లే దారిలో పలుచోట్ల రహదారి దుస్థితి

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

కొత్తూరు, సెప్టెంబరు 4 : అనకాపల్లి జిల్లాలో భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదు బుధవారం ప్రారంభమైంది. ఈ మేరకు స్థానిక ఎంపీ సీఎం రమేష్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి, ఉత్తరాంధ్ర సభ్యత్వ జోనల్ ఇన్‌చార్జి కేతినేని సురేంద్రమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో ఉత్తరాంధ్రలోనే అనకాపల్లి జిల్లాకు ప్రత్యేకమైన గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా 18 నుంచి 25 ఏళ్ళ వయసు వారిని భాగస్వాములను చేయాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పలువురికి కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, సభ్యత్వ ఇన్‌చార్జి బీవీఎస్ వర్మ, రాజుబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

షెల్టర్ హోంను పరిశీలించిన అధికారుల బృందం



షెల్టర్ హోం వివరాలపై ఆరా తీస్తున్న అధికారులు

నక్కపల్లి, సెప్టెంబరు 4 : ఉపమాక శివారు కొండవెనుకపాలెంలో ఉన్న షెల్టర్ హోంను బుధవారం సాయంత్రం అధికారుల బృందం పరిశీలించింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల చిల్డ్రన్ ప్రొటెక్షన్ అధికా రులు శరత్, లక్ష్మి, స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత తదితరులు షెల్టర్ హోంను తనిఖీ చేశారు. ఇక్కడ వసతులను పరిశీలించారు. బాలికలతో మాట్లాడారు. త్వరగా అనుమతులు తీసుకోవాలని చెప్పినా ఎం దుకు పట్టించుకోలేదని సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. అనుమతులు వచ్చే వరకూ పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించేయాలని, షెల్టర్ హోంను నిబంధనల మేరకే నడపాలని సూచించారు. అనంతరం సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు సమక్షంలో షెల్టర్ హోం నిర్వాహకులతో చర్చించారు. అనుమతులను త్వరలోనే అనుమతులు తెచ్చుకుంటామని వారు వివరించారు.

కోటవురట్లలో ఘనంగా అయ్యన్న జన్మదిన వేడుకలు



అయ్యన్న బర్త్‌డే కేక్‌ను తినిపించుకుంటున్న టీడీపీ శ్రేణులు

కోటవురట్ల, సెప్టెంబరు 4: శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలంకాశీనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి పెట్ల లింగంనాయుడు మండలంలోని జల్లూరులో కేక్‌కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేచలపు భాస్కరరావు, యండపల్లి చంటి, జీరెడ్డి నానిబాబు, రాజుపేట సర్పంచ్ వెంకటరమణ, పందూరు మాజీ సర్పంచ్ ఏలేశ్వరపు సత్యనారాయణ, నాంబారు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ఎలమంచిలి, సెప్టెంబరు 4 : ఇక్కడి కోర్టు ఆవరణలో ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మండల న్యాయ సేవాధికార సంఘం అధికారిణి పి.విజయ సూచించారు. పెండింగ్‌లో ఉన్న రాజీపడే సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదాలు, ప్రీ లిటిగేషన్ తదితదితరాలు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదికగా పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న అగ్నిమాపకశాఖ అధికారి నరసింగరావు

పరవాడ, సెప్టెంబరు 4 : ప్రమాదాలు, ప్రకృతి విపత్తులపై పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు సంస్థ, జిల్లా అగ్నిమాపక సేవల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, లైఫ్ సేవ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వంటింట్లో గ్యాస్ సిలెండర్ నుంచి మంటలు రేగినప్పుడు వాటిని అదుపులోకి తేవడం ఎలా, నీటిలో మునిగిపోకుండా లైఫ్ జాకెట్ ఎలా ధరించాలి తదితర అంశాలను జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నరసింగరావు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, అగ్నిమాపక శాఖ సిబ్బంది, పాఠశాల సీఈవో నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఎంపీడీవో రామచంద్రమూర్తికి సత్కారం



ఎస్.రాయవరం, సెప్టెంబరు 4 : ఇక్కడి ఎంపీడీవో ఎస్వీ రామచంద్రమూర్తి పదవీ విరమణ పొందడంతో బుధవారం సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయనకు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, కొత్తపల్లి ఎంపీడీవో వెంకటనారాయణ, ఏవో రమణరాజు, టీడీపీ సీనియర్ నేత వజ్రపు శంకరరావు, సర్పంచులు శివ, సత్యనారాయణ, వైసీపీ సీనియర్ నేత పోలిశెట్టి పెద ఈశ్వరరావు, కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



తుమ్మపాలలో స్వామిని దర్శించుకుంటున్న పీలా



కొండకర్ల అందలాపల్లిలో ప్రగడ పూజలు

తుమ్మపాల/కొత్తూరు, సెప్టెంబరు 4 : కృష్ణాష్టమి వేడుకలు తుమ్మపాల, కొత్తూరులలో ఘనంగా ముగిశాయి. గత సోమవారం స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నాటి నుంచి నేటి వరకు విశేష పూజలు నిర్వహించారు. బుధవారం అనుపోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. తుమ్మపాలలో నాయకులు కర్రి బాబి, రాపేటి రామ్‌కుమార్, సందిన చినబాబు, సునీల్, ఆడారి గోవిందరావు, వియ్యపు సింహాచలం, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొత్తూరులో టీడీపీ నాయకులు మళ్ళ సురేంద్ర, కోన శ్రీను, మేడిశెట్టి సత్తిబాబు, మేడిశెట్టి నూకరాజు, బర్ల నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం పరవాడపాలెంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో భాగంగా స్వామిని పీలా గోవింద దర్శించుకున్నారు.

అచ్యుతాపురం : కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా కొండకర్ల అందలాపల్లిలో ఏర్పాటు చేసిన స్వామివారి విగ్రహాన్ని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్యామల రాజు, దాసరి నర్సింగరావు, చొప్పా సన్యాసిరావు, మొల్లి కృష్ణారావు, బొద్దపు సుధాకర్, కారుకుండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పరవాడలో భూలోకమాంబ పండగ



పరవాడ, సెప్టెంబరు 4 : మండల కేంద్రం పరవాడ ప్రజల ఆరాధ్య దేవత భూలోకమాంబ పండగ గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేపట్టింది. వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టి అర్చకులు పూజలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. మధ్యాహ్నం అన్నసమాచారధన, సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు ఉంటుందని భక్తులు పాల్గొనాలని కోరారు.

రూరల్ సీఐగా అశోక్‌కుమార్ బాధ్యతలు



అశోక్‌కుమార్

కొత్తూరు, సెప్టెంబరు 4 : అనకాపల్లి రూరల్ సీఐగా జి.అశోక్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా జి.కె.వీధి నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఇంత వరకు ఈ స్థానంలో ఉన్న ధనుంజయరావు ఎలమంచిలి సీఐగా బదిలీపై వెళ్లారు. ఇదిలావుంటే, కొత్త సీఐకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

హరికథా గాయినికి సత్కారం



రాణి సువర్ణకు జ్ఞాపిక అందిస్తున్న లక్ష్మీనారాయణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 4 : ఇక్కడి గౌరీ పంచాయతన ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా మహాభారతం ఆఖరి ఘట్టంపై హరికథా గానం చేసిన రాణి సువర్ణను మంగళవారం రాత్రి సత్కరించారు. వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు ఆమెతో పాటు, వాయిద్య కళాకారులను దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి టీడీపీ నేతల పరామర్శ

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 4 : బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీరంగం రమేష్‌ను బుధవారం పీఎల్‌పురంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు పరామర్శించారు. రమేష్ తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆయన ఇంటికి వెళ్ళి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకాయల రాంబాబు, దుర్గాప్రసాద్, వేములపూడి అప్పారావు, దొంగల శ్రీను, బంగారు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ



అనాథలకు పండ్లు, బిస్కెట్లు సిద్ధం చేసిన నాయకులు

కశింకోట, సెప్టెంబరు 4 : భీమవరం గ్రామంలోని అనాథ ఆశ్రమంలో వికలాంగులు, అనాథ చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు తదితరాలను పంపిణీ చేశారు. తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు కాయల మురళీ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు కూండ్రపు దీపు తెలిపారు. అనంతరం అనాథలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీబీ, హెచ్‌ఐవీపై కార్మికులకు అవగాహన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 4 : ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో కార్మికులకు బుధవారం ఎన్టీఆర్ వైద్యాలయం సిబ్బంది టీబీ, హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. రెండు వారాలు మించిన దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, దగ్గినప్పుడు కఫంలో రక్తం పడడం వంటి లక్షణాలు ఎవరికైనా కనిపిస్తే సమీపంలోని ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. ఒకవేళ టీబీ వ్యాధి నిర్ధారణ అయితే అటువంటి వారికి ఆరు నెలలకు సరిపడా మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది పెంటయ్య అయ్యప్ప, పద్మజా, లక్ష్మితో పాటు కొలగార్ల సంఘం, కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 4 : పట్టణానికి ఆనుకుని ఉన్న తుమ్మపాలలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ కథనం ప్రకారం వివరాలి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం తూటంగి గ్రామానికి చెందిన ప్రధాని రాంబాబు ద్విచక్ర వాహనంపై పరవాడ ఫార్మాసిటీకి వెళ్లేందుకు బుధవారం వస్తున్నాడు. ఇంతలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో నేలకొరిగాడు. దీంతో అతడి కుడికాలి పైనుంచి లారీ దూసుకుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాంబాబును ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

'ఆస్పత్రి కార్మికుల బకాయిలు చెల్లించాలి'

ఎలమంచిలి, సెప్టెంబరు 4 : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ విభాగాల్లో కార్మికులకు బకాయి పడిన నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఇటువంటి కార్మికులకు ఇస్తున్న వేతనాలే అంతంత మాత్రమని, అవి కూడా సకాలంలో చెల్లించకుంటే ఎలా అని ప్రశ్నించారు. కనీస వేతనం 16,500 చెల్లించి, అన్ని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల శివాజీ, కార్మిక సంఘం ప్రతినిధి అప్పలరాజు పాల్గొన్నారు.

'పంచాయతీ స్థలంలో పనులు నిలిపివేయాలి'

పాయకరావుపేట, సెప్టెంబరు 4 : ఇక్కడి మెయిన్ రోడ్డులో గల పంచాయతీ స్థలంలో చేపడుతున్న నిర్మాణ పనులను తక్షణం నిలిపివేయాలని పంచాయతీ అధికారులు ఆదేశాలు జారీచేశారు. బుధవారం పీఆర్ గెస్టు హౌస్ ఎదురుగా సర్వే నంబరు 132/2బిలో గతంలో లేఅవుట్ వేసిన స్థలంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని సంబంధిత అధికారులు సమాచారం అందుకున్నారు. దీనిపై పంచాయతీ ఈఓ వర్మ వెంటనే ఆ పనులు నిలిపివేయాలని సంబంధిత వ్యక్తులకు నోటీసు జారీచేశారు.

పౌష్టికాహారంతో పిల్లలకు ఆరోగ్యం

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల. సెప్టెంబరు 4 : పిల్లలకు పుట్టిన దగ్గర నుంచి పౌష్టికాహారం అందించడం వల్ల వారి ఎదుగుదలతో పాటు ఆలోచన శక్తి పెరుగుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో పాల్గొన్న ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి శ్రీదేవి, ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలరావు, ఇన్‌చార్జి ఎంపీపీ రాజారాం, మాజీ ఎంపీపీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.90 లక్షలు మంజూరు

» మాజీ ఎంపీపీ భాస్కరరావు, సర్పంచ్ పెంటమ్మ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరావు, కూటమి నాయకులు

దేవరాపల్లి, సెప్టెంబరు 4 : మేజరు పంచాయతీ దేవరాపల్లిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి ఉపాధి హామీ పథకం నుంచి రూ.90 లక్షలు మంజూరు చేశారని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ విలేకరులకు తెలిపారు. సీసీరోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలు, డ్రైనేజీలకు రూ 35.50 లక్షలు దళితుల శ్మశాన వాటికల్లో షెడ్లు, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.15 లక్షలతో పాటు మరికొన్ని పనులు చేపట్టనున్నట్టు వారు తెలిపారు. నిధులు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ టీసీ మొలి కృష్ణమూర్తి, బంధం అప్పలరాజు, దీవి శంకర్, గుల్లిపల్లి అర్జునరావు, సిమ్మ అప్పన్న, దేముళ్లు, అల్లు అబద్ధం, శివశంకర్ పాల్గొన్నారు.

తురకలపూడి పీహెచ్‌సీలో జిల్లా టాస్క్‌ఫోర్స్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ లూసీ కార్డియా

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 4 : జిల్లా టాస్క్‌ఫోర్స్‌టీమ్ బుధవారం తురకలపూడి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసింది. టీమ్ ప్రధానాధికారిణి డాక్టరు లూసీ కార్డియా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వైద్య సిబ్బందితో మాట్లాడుతూ కిశోర బాలికలు వివాహం జరిగిన తరువాత గర్భం దాల్చితే పుట్టే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండటం వల్ల మాతా శిశు మరణాలు నివారించవచ్చని సూచించారు. టాస్క్‌ఫోర్స్ టీమ్ జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, డీపీవో జగదీష్, ఐడీఎస్పీ కో-ఆర్డినేటర్ జనార్ధన్‌లు మాట్లాడుతూ స్కూల్ పిల్లలు, గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత నివారణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్యారాణి, డాక్టరు సునీల్, ఎంపీహెచ్‌ఈవో హెచ్‌వీ రమణ, హెచ్ఎస్ సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

» గిరిజనుల వినతి



గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గిరిజనులు

చీడికాడ, సెప్టెంబరు 4 : తమ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులందరూ ముందుకు రావాలని రెండు గిరిజన గ్రామాల ప్రజలు కోరారు. బుధవారం మండలంలోని ఎం.గతబూరు, చిన్నకోనం గ్రామాల్లో పీఎం-జన్మన్ గ్రామ సభను నిర్వహించారు. ఎంపీడీవోతో పాటు వివిధ మండలశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పోడు వ్యవసాయ భూములకు గతంలో మట్టిరోడ్డును నిర్మిస్తే కొందరు భూస్వాములు ఆ స్థలాన్ని కబ్జా చేశారని చిన్నిస్వామి, కుమ్మరి లోవరాజు ఫిర్యాదు చేశారు. ఇంకా చాలా మంది గిరిజనులకు పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయప్రకాష్ రావు, ఈవోపీఆర్డీ కామేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారి మరమ్మతు

చందాలు వేసుకొని బాగు చేసుకున్న గుడ్డిప గ్రామ యువకులు



ఆర్‌ఈసీ రోడ్డు గుంతలు పూడ్చుస్తున్న యువకులు, టీడీపీ నాయకులు

రావికమతం, సెప్టెంబరు 4 : 'ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని..' కాకుండా గుడ్డిప గ్రామ యువకులు తమ గ్రామానికి వెళ్లే రోడ్డును బాగు చేసుకునే పనిని చేపట్టారు. అధ్వానంగా తయారైన ఆర్‌ఈసీ రోడ్డు గుంతలను గత రెండు రోజులుగా గుడ్డిప గ్రామ యువకులు, టీడీపీ స్థానిక నేతలు క్రషర్ బుగ్గితో పూడ్చివేత చేపట్టారు. రావికమతం నుంచి తోటకూరపాలెం వరకూ ఉన్న ఈ రోడ్డులో అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

ముఖ్యంగా గొంప నుంచి గుడ్డిప-తట్టబంద వరకూ భారీ గోతులలో వర్షపు నీరు చేరింది. ఈ నేపథ్యంలో గుడ్డిప గ్రామ యువకులు, మండల టీడీపీ రైతు అధ్యక్షులు మేలాసి పెద్దినాయుడు (బుజ్జి) టీడీపీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఇందలి శివ, టీడీపీ యూత్ అధ్యక్షుడు వై.సత్తిబాబు చొరవ తీసుకొని చందాలు వేసుకొని రోడ్డు తాత్కాలిక మరమ్మతులకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం శ్రీజ మెట్ల క్వారీ యజమాని క్వారీ బుగ్గిని ఉచితంగా అందించారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ముగింపు



కృష్ణుడిని దర్శించుకున్న చోడవరం ఎమ్మెల్యే రాజు



ఆలయంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 4 : నేతవానిపాలెంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ నవరాత్రులు బుధవారంలో ముగిశాయి. కృష్ణాష్టమి రోజు కృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఆఖరి రోజున ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తదితరులు కృష్ణుడిని దర్శించుకుని పూజలు చేశారు. బుచ్చెయ్యపేట సర్పంచ్ సుంకర లక్ష్మి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కె.కోటపాడు, గొల్లలపాలెం గ్రామాల్లో ఘనంగా నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి నవరాత్రి వేడుకలు బుధవారంతో ముగిశాయి. గొల్లలపాలెంలోని శ్రీకృష్ణ ఆలయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అందించారు. మధ్యాహ్నం నుంచి అన్నదాన నిర్వహించారు. సాయంత్రం తీన్‌మార్ డప్పులు, బల్ల వేషాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు.

బురదలో దిగబడిన బస్సు



తాండవ రోడ్డులో బురదలో ఇరుక్కున్న బస్సు

నాతవరం, సెప్టెంబరు 4 : నాతవరం మండలం తాండవ రోడ్డులో బుధవారం ఆర్టీసీ బస్సు బురదలో కూరుకుపోయింది. దీంతో కళాశాలలు, పాఠశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఉదయం నాతవరం-చమ్మచింత మధ్యలో ఆర్టీసీ బస్సు తాండవ వెళ్తుండగా బురదలో కూరుకుపోవడంతో ఓ పక్కకు ఒరిగిపోయింది. ఈ రోడ్డు ఐదేళ్ళ నుంచి అధ్వానంగా ఉన్నా ఎలాంటి మరమ్మతులు చేయలేదు. ఈ మార్గంలో 8 గ్రామాలకు చెందిన ప్రజలకు రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ పదుల సంఖ్యలో వివిధ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అయ్యన్న జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



మాకవరపాలెంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



నాతవరం : మొక్కలు నాటుతున్న నేతలు



నర్సీపట్నం : 25వ వార్డులో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చింతకాయల దివ్య

మాకవరపాలెం, సెప్టెంబరు 4 : మండలంలోని పలు ప్రాంతాల్లో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 68వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తామరం ప్రభాకర్‌రాజు ఇంటి వద్ద కేకును కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం మాకవరపాలెం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, టీడీపీ సీనియర్ నాయకులు అల్లు రామునాయుడు, జోగిపాత్రుడు, నందకిషోర్, కేతిరెడ్డి చిరంజీవి, జమరాం,లాలం రాము తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు జన్మదినం సందర్భంగా మండలంలోని వైబీపట్నంలో సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ కూండ్రపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు శ్రమదానం, పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. వైబీపట్నం-గన్నవరం రోడ్డులో గోతుల్లో గ్రావెల్ వేసి శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరుప్రోలు దొరబాబు, షేక్ కుదాన్‌సాహెబ్, కూండ్రపు తాతబ్బాయి, తోట జోగుబాబు, బండారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం : స్పీకర్ అయ్యన్నపాత్రుడు జన్మదినం సందర్భంగా బుధవారం మునిసిపాలిటీ 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ భార్య దివ్య బీసీ కాలనీలోని బాలసదనం వసతిగృహంలో విద్యార్థులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం

పాఠశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీలు



మట్టి వినాయక ప్రతిమలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కె.కోటపాడు, సెప్టెంబరు 4 : 'మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుదాం' నినాదంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో ప్రతి గ్రామంలో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటుకు అందరూ కృషి చేయాలన్నారు. మండలంలో ఉన్న పాఠశాల విద్యార్థుల ద్వారా ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని నినాదాలు చేస్తూ కె.కోటపాడు జంక్షన్‌లో విద్యార్థులు మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ పద్మావతి, బోకం ఎర్రినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూటిపాలలో 'స్వచ్ఛతా పక్వాడ'



మాకవరపాలెం, సెప్టెంబరు 4 : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామ సందర్శన చేశారు. తూటిపాలలో ఇండ్లను సందర్శించి స్వచ్ఛత గురించి అవగాహన కల్పించారు. ఇంటిలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని, తడి-పొడి చెత్త గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ బాలికల విద్యాలయంలో వైద్య శిబిరం



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న వైద్య బృందం

రోలుగుంట, సెప్టెంబరు 4 : మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల విద్యాలయంలో బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి, గైనకాలజిస్టు అనీష, వైద్యాధికారి శ్రావణి పాల్గొని 243 మంది బాలికలకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి గైనిక్ సమస్య, 24 మంది ఇతర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఉన్నట్టు గుర్తించారు. మిగతా 189 మంది బాలికలకు ఎటువంటి సమస్యలు లేనట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. కార్యక్రమంలో విద్యాలయం ఎస్‌వో తులసీ తదితరులు పాల్గొన్నారు.

8న యాదవ విద్యార్థులకు పురస్కారాలు



సమావేశంలో మాట్లాడుతున్న సాయినాథ్

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 4 : ఈ నెల 8న జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8న (ఆదివారం) అనకాపల్లిలో యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్టు జిల్లా సంఘాధ్యక్షుడు భరిణికాన సాయినాథ్ తెలిపారు. దీనిపై చర్చించేందుకు బుధవారం వడ్డాదిలో సంఘం నాయకులతో ఆయన సమావేశమైయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్, టెన్త్ పరీక్షల్లో మెరిట్ సాధించిన యాదవ విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తామన్నారు. అలాగే ప్రజాప్రతినిధులకు సంఘం తరఫున సన్మానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా యాదవ సంఘం నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, సింగంపల్లి రమేష్, సబ్బి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్‌తో గిరిజన గ్రామాలకు మహర్దశ

రోలుగుంట, సెప్టెంబరు 4 : ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ యోజన (పీఎం జన్‌మన్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గడబపాలెం, గుర్రాలబైల గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకంపై నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి సంపూర్ణ అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేయనున్న ఈ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంక్షేమ పథకాల అమలుకు ప్రణాళికలు రూపొందించనున్నట్టు తెలిపారు.

రావికమతం : చీమలపాడు పంచాయతీ పరిధిలో అన్ని గిరిజన గ్రామాలలోనూ గిరిజన సంక్షేమం కోసం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు గిరిజన సంక్షేమాధికారి వి.నాగశిరీష తెలిపారు. మండలంలో చీమల పాడు, ములకాలపల్లి గిరిజన గ్రామాలలో బుధవారం సర్పంచ్ వంజరి గంగరాజు అధ్యక్షతన అవగాహన సదస్సులు నిర్వహించారు. మారుమూల గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు నల్లి కల్యాణం, కార్యదర్శి రామయ్య, ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : గిరిజన గ్రామాల్లో గిరిజననుల జీవన విధానంలో మార్పులు తీసుకొచ్చేందుకుగాను కేంద్రం ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎంపీడీవో డేవిడ్‌రాజ్ అన్నారు. మండలంలోని బుధవారం ఏటిగైరంపేట గ్రామ పంచాయతీ శివారు ముంగర్ల పాలెం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఇక్కడ చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులను గ్రామ సభద్వారా గుర్తించారు.

విద్యార్థులకు హోమియో మందు పంపిణీ

నర్సీపట్నం, సెప్టెంబరు 4 : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జన్మదినం సందర్భంగా ఆయుష్మాన్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఫ్లూ జ్వరాలు రాకుండా సాంఘిక సంక్షేమ వసతి గృహంలో 240 మంది విద్యార్థులకు హోమియో మందు పంపిణీ వేశారు. భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఆట వస్తువులు, ఆహార పదార్థాలు అందజేశారు. వర్షాల నేపథ్యంలో అందరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలగా నారాయణరావు, శిరం లక్ష్మణరావు, కుసుమంచి కృష్ణ, హోమియో వైద్యులు పి.రమణారావు పాల్గొన్నారు.

సింగిల్ విండో విధానంలో గణేశ్ మండపాలకు అనుమతులు

» సీఐ కోటేశ్వరరావు



రావికమతం, సెప్టెంబరు 4 : వినాయక చవితి మండపాల ఏర్పాటుకు అనుమతుల కోసం సింగిల్ విండో విధానం అమలు చేస్తున్నట్టు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు తెలిపారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం లేదా 7995095800 నెంబరుకు వాట్సాప్‌లో హెచ్‌ఐ అని మెసేజ్ చేస్తే అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం ఆ ఫోన్‌కు వస్తుందన్నారు. సర్కిల్ పరిధిలో రావికమతం, కొత్తకోట, రోలుగుంట, బుచ్చెయ్యపేట ఎస్సైలకు వీటిపై ముందుగానే అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కృష్ణాదేవిపేట : వినాయకచవితి పండగ నేపథ్యంలో మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కృష్ణాదేవిపేట ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు.

సంక్షిప్తంగా..

నూతన ఎస్‌ఐలు బాధ్యతల స్వీకారం



ధనుంజయ్

కె.కోటపాడు, సెప్టెంబరు 4 : నూతన ఎస్‌ఐగా ఆర్.ధనుంజయ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సబ్బవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానన్నారు. అందరి సహకారంతో శాంతిభద్రతలు పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.



మల్లేశ్వరరావు

దేవరాపల్లి : దేవరాపల్లి ఎస్‌ఐగా టి.మల్లేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇంతకు ముందు పరవాడ, సబ్బవరం, కె.కోటపాడు, పెదబయలు మండలాలకు ఎస్‌ఐగా పని చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

విద్యుత్ అంతరాయం రేపు

నాతవరం, సెప్టెంబరు 4 : ఈ నెల 6న (శుక్రవారం) మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ చంద్రమౌళి తెలిపారు. నాతవరం సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ నిర్మాణ పనులు చేపడుతుండడంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాతవరం, మర్రిపాలెం గుమ్మిడిగొండ తదితర గ్రామాల్లో విద్యుత్ సరాఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

దేవరాపల్లి : దేవరాపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పెదనందిపల్లి ఫీడర్‌లో ఈ నెల 6న సరఫరాకు అంతరాయం కలగనుందని నర్సీపట్నం ఈఈ రామకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పెదనందిపల్లి, చిననందిపల్లి, కాశీపురం, నాగయ్యపేట, రైవాడ, చింతలపూడి, తామరబ్బ, పంచాయతీల పరిధుల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు మరిడిమాంబ పండగ

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 4 : గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేట గ్రామదేవతైన మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామంలో విద్యుత్ అలంకరణతో పాటు ఆలయానికి, అమ్మవారి విగ్రహానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. పండగరోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి నుంచే అమ్మవారి గరగరలు ఊరేగింపుతో పండగ సందడి మొదలైంది. ఈ పండగ నిర్వహణకు అందరూ సహకరించాలని సర్పంచ్ సత్యం నాయుడు, నిర్వాహకులు కూటమి నాయకులు కోరారు.

8న ఎస్సీ కుల వర్గీకరణపై వ్యతిరేక సదస్సు

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 4 : ఎస్సీ కుల వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 8న (ఆదివారం) మాలల సదస్సు నిర్వహిస్తున్నట్టు మాజీ జడ్పీటీసీ చిట్ల చలపతి తెలిపారు. బుధవారం పెదబొడ్డేపల్లిలో మాలల సదస్సు కరపత్రాలు విడుదల చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు అప్పలరాజు, 5వ షెడ్యూల్ సాధన సమితి సభ్యులు బొడ్డు కళ్యాణం, మర్రా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

మాడుగుల రూరల్, సెప్టెంబరు 4 : టిప్పర్ లారీలో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా గొటివాడ అగ్రహారం వద్ద పట్టుకున్నట్టు ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. గొటివాడ అగ్రహారం వద్ద పెద్దేరు నది నుంచి ఇసుక సేకరించి చోడవరం తరలిస్తున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి : సీపీఐ



ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

గొలుగొండ సెప్టెంబరు 4 : ఏపీలో వరద బాధితులను కేంద్ర ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ తుపాను తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురుబాబు, మండల సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు మేకా భాస్కరరావు పాల్గొన్నారు.

గందరగోళంగా సదరం క్యాంపు

... 5వ పేజీ తరువాయి

ఒకేసారి భారీగా దివ్యాంగులు రావడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. డీఎం అండ్ హెచ్‌వో ఆధ్వర్యంలో జరిగే ఈ క్యాంప్‌నకు వైద్యులను సమకూర్చి దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. అయితే నిర్దేశించిన దివ్యాంగుల కంటే అధిక సంఖ్యలో రావడంతో పరిస్థితి మారిందన్నారు. మండలాల వారీగా అందరికీ సమాచారం ఇచ్చి క్యాంపులు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. మధ్యాహ్నం ఆర్థోపెడిక్‌కు సంబంధించి 50 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించామని ఆయన తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 38 మంది ఎంపిక

... 5వ పేజీ తరువాయి

కె.రవికుమార్ (ఎంపీపీఎస్, రత్నంపేట, రోలుగుంట), బి.సూర్యనారాయణ (ఎంపీపీఎస్, వెలమకాయల పాలెం, రోలుగుంట), జి.రాజశేఖర్ (ఎంపీపీఎస్, చిన్నగొల్లపాలెం, ఎలమంచిలి), ఏపీ రామచంద్రరావు (జీవీఎంసీ టౌన్, అనకాపల్లి), ఎ.రమణమూర్తి (ఎంపీపీఎస్, లింగంపేట, గొలుగొండ), ఎ.అప్పాజీరావు (ఎంపీయూపీఎస్, కొక్కిరాపల్లి, ఎలమంచిలి), కె.నూకేశ్వరరావు (జీవీఎంసీ గాంధీ గ్రామ్, అనకాపల్లి), వై.నర్సింహమూర్తి (ఎంపీపీఎస్, వైబీ పట్నం, రోలుగుంట), ఎస్‌టీపీ విద్యావతి (ఎంపీపీఎస్, టి.అర్జాపురం, రావికమతం).